# పి.ఆర్. చంద్రిక

చంద్రిక రెండురోజుల క్రితమే టీనేజీ దాటింది. పేరుకు తగినట్టే ఆమె వెన్నెల కాసినట్టుంటుంది. సంపెంగలు పూసినట్టుంటుంది. ఆ జడచూస్తే నెమలి పురివిప్పినట్టుంటుంది. నవ్వితే గంటలు మోగినట్టుంటుంది. మాట్లాడితే వినడానికి చాలా హాయిహాయిగా వుంటుందని తప్ప ఆమె అందం గురించి ఇదీ అని స్పష్టంగా వర్ణించడం కష్టమే. నడుస్తుంటే ఆనడకలో విరుపులు గమ్మత్తుగా వుంటాయి. ఏమేమి చేస్తే ఏమేమిగా వుంటాయో చెప్పడం కష్టం. ఇలాంటి సమయాల్లో భాష చాలా అసమర్ధవంతమైందని గుర్తించకతప్పదు.

చంద్రిక స్నేహితురాలు సుందరవల్లికి ప్రధానం జరిగింది. ఆ ఫంక్షన్‌కి కోలనీలోని అమ్మలక్కలందరూ చేరారు. పేరంటాళ్ల పట్టుచీరలూ బంగారపునగలూ చంద్రిక ముందు వెలవెలబోయాయి. ఆ రోజామె తెల్ల లంగా తెల్లజాకిట్టు వేసుకుని ఆకుపచ్చవాణీ వేసుకుంది. 'గోల్డ్‌స్పాట్' తాగితే - ఆ జాడ గొంతులోంచి గుండెల్దాకా కనిపిస్తుంది. స్వచ్ఛమైన నీళ్లలాంటి అందం.

"నిన్నెవడు చేసుకుంటాడోగాని చాలా అదృష్టమంతుడు" అన్నాదో ఇల్లాలు. చంద్రిక ఆ మాట చాలా మంది నోటంట విన్నాది.

ఆ అదృష్టవంతుడెవడూ ఆమెనింకా పెళ్లాడలేదు. చంద్రికా, సుందరవల్లీ ఇంటర్ మీడియెట్ వరకూ చదివారు. చంద్రిక అక్కడితో ఆపేసింది. సుందరవల్లి ఫస్టియర్ డిగ్రీ చదివి మానేసింది. ఎలమంచిలి సంబంధం కుదిరింది. అబ్బాయి డిగ్రీ చదివాడు. డైరెక్ట్‌గా ఎస్సయి సెలక్షనొచ్చిందట. వల్లి చంద్రికంత అందగత్తై కాకపోయినా కొట్టి పారెయ్యవలసిన అందం కాదామెది. తల్లి పోలిక. తండ్రి సీనియర్ హెడ్ కానిస్టేబిల్.

చంద్రిక పూర్తిపేరు పూసపాటి రామచంద్రిక. తండ్రి పేరు పూసపాటి వేణుగోపాల వీరవెంకట సత్యనారాయణ రాజు. కొద్ది రోజుల క్రితం హెడ్‌కానిస్టేబిల్ ప్రమోషనొచ్చింది. మరొక్క ఏడాది సర్వీసుంది. అతన్నంతా సత్తిరాజు అంటారు. పెద్దకొడుకు మిలట్రీలో పనిచేస్తున్నాడు. రెండో కొడుకు భీమవరంలో డిగ్రీ చదువుతున్నాడు. వాళ్లది ఆ దగ్గిరలోనే ఉండి సమీపంలో పెద్దపుల్లేరు. సత్తి రాజుది బొత్తిగా బేలగుండె. జాలిజాస్తి. మనిషికూడా సన్నగా పొడుగ్గా జండా కొయ్యలా వుంటాడు.

"నా కొడక నువ్వు పోలీసుద్యోగాని కెందుకొచ్చావురా మమ్మల్ని ........ కీ? ఏ గుమాస్తావనో మేస్టరువనో చూసుకోక" అని అతన్ని ఎస్సయి ఎప్పుడూ వేళాకోళంగా తిడుతుంటాడు. చాన్నాళ్లు స్టేషన్లో రైటరుగా చేశాడు. కొన్నాళ్లు 'ట్రాఫిక్' లో చేశాడు. ఆ తరవాత లా అండ్ ఆర్డర్‌లో ప్రవేశించాడు. చంద్రికకు మేనరికం సంబంధం వుందిగాని, ఆ కుర్రాడెందుకూ పనికి రాడు. చదువూ లేదు సంపాదనా లేదు. వాడికివ్వడం ఎవరికీ ఇష్టం లేదు. పై సంబంధాలు చూస్తున్నారు. పిల్ల అందంగా వున్నప్పటికీ, కట్నాలు కూడా ఎక్కువగానే అడుగుతున్నారు. ఎంత పోలీసుద్యోగం చేస్తే మాత్రం అంతలేసి కట్నాలెక్కణ్ణించి వస్తాయి. సత్తిరాజుకు ఉండిదగ్గిర పెదపుల్లేరులో తాతల్నాంటి పెంకుటిల్లు తప్ప మరే విధమైన ఆస్తీలేదు. పెళ్లాం వంటిమీదా, కూతురు చంద్రిక వంటి మీదా తగుమాత్రం బంగారం వుంది... ఎలాగో కష్టపడి ఈ సంవత్సరం పెళ్లి చేసెయ్యాలన్న ఆలోచనలో ఉన్నాడు....

చంద్రిక, సుందరవల్లీ మరికొందరూ రోజా సిటీబస్సులో విజయనగరం మహారాజ మహిళా కళాశాలకి వెళ్లి చదువుకునీ వారు. కాలేజీ కోటలో వున్నాది. వాళ్లకి పోలీసుక్వార్టర్స్‌లో యిల్లు దొరకలేదు. ఆ దగ్గిరలో వేరే కోలనీలో వుంటున్నారు. చంద్రికకి సిటీబస్సుప్రయాణం రోజా గండంగానే వుండేది. సిటీబస్సులో అందరూ రాసుకు తిరిగేవారే. రెండర్థాల బూతుజోకులు వేసేవారే. కొంత వరకూ - ఈ ఇబ్బందులు పడలేకనే చదువు మానేసింది. తల్లి రాజ్యాలక్ష్మికి కూతురు ఆలస్యంగా ఇంటికొస్తే గుండెలు కొట్టుకునేవి. పోలీసు కూతురని, స్టూడెంటు గుంటలకేం తెలుస్తుంది? తెలిస్తే మాత్రం భయపడిపోతారు కనుకనా?

వీలయినంత త్వరలో చంద్రిక పెళ్లి చేసెయ్యమని తొందరచేస్తున్నది తల్లి. మేనరికం పెళ్లి చేసుకోనుగాక - చేసుకోనంటుంది చంద్రిక. చూస్తున్న పెళ్లిసంబంధాలు కూడా ఆ అమ్మాయికొకంతట నచ్చడం లేదు. ఇంతలో చంద్రిక చచ్చిపోయింది.

⋆⋆⋆

పి.ఆర్.చంద్రిక హత్యకేసు (పి.ఆర్.సి. 1/2001) రోజుకో మలుపు తిరుగుతున్నాది.

2000 సంవత్సరం డిసెంబర్ 31 ఆదివారం రాత్రి ఆమె హత్యకు గురయింది. 2001 జనవరి 2 మంగళవారం ఉదయం ఆమె శవాన్ని పాడుపడిన నూతిలోంచి బయటికి తీశారు.

- గొంతు పిసికీ చంపి నూతిలో పారేశారు.

- కొందరు కుర్రాళ్లు ఆమెపై సామూహిక అత్యాచారం చేసి, సొమ్మసిల్లి పడివున్న దశలో ఆమెను పాడిపడిన నూతిలో పారేశారు.

- దుండగులు వెంటతరుముతుంటే చీకట్లో పారిపోతూ పాడుపడిన నూతిలో పడి చచ్చిపోయింది.

- ఒకబ్బాయితో ప్రేమలోపడి, నెలతప్పినంత పనయి, మందుమింగి పాడునూతిలో గెంతి ఆత్మహత్యచేసుకుంది.

ఇలా చాలా చాలా రకాలుగా పుకార్లు ప్రచారమయ్యాయి. చంద్రిక తండ్రి సత్తిరాజు దాదాపు పిచ్చివాడయిపోయేడు. నిరంతరం తాగుతున్నాడు. ఉద్యోగానికి సెలవు పెట్టేసేడేట.

ఆ కోలనీ సమీపంలో ఒక పాడుపడిన యిల్లుంది. ఆ పెంకుటింటి సమీపంలో ఒక పెద్ద మర్రిచెట్టు, ఆ ఊడలమర్రిచెట్టు సమీపంలో ఒకపాడిబడినగట్లు లేని నుయ్యి వున్నాయి. గట్లులేకపోయినా అట్టడుగున ఎక్కడో నీళ్లు మెరుస్తుంటాయి. పెంకుటింటి పాడుపడిన భాగానికి పక్కకొంత బాగున్న గదిలాంటి దొకటుంది. కోలనీ కుర్రాళ్లూ, ఇతరత్రా ఆచుట్టపక్కల్నించి చేరిన గుంటలూ అక్కడ పేకాటాడుతుంటారు. పులీ మేకా ఆడుతుంటారు. మందుపార్టీలు చేసుకుంటుంటారు. చీకటాటలూ ఆడుతుంటారు.

అలాంటిదొక చీట్లాటా, మందుచిందులూ, చీకటాటా డిసెంబర్ 31 రాత్రి జరిగింది. ఆ ఆటలాడినవాళ్లు - సుబ్బరాజు, అంకినీడు, వెంకటశర్మ, కృష్ణారావు, సాయి - అనబడే ఐదుగురు యువకులు. వారి వయసు బహుశా పద్దెనిమిది లేక పంతొమ్మిదికీ - ఇరవైరెండు లేక ఇరవై మూడుకే మధ్య వుండొచ్చు.

సుబ్బరాజు ఒక కాంట్రాక్టర్ కొడుకు చదువు అబ్బలేదు. టెన్త్‌క్లాసు పోయింది. జులాయిగా తిరుగుతున్నాడు. అంకినీడు ఒక హెడ్‌కానిస్టేబిల్ కొడుకు. ఇంటర్మీయెట్ ఇన్‌స్టంట్‌లో పేసయిన కారణం చేత - తండ్రి అతనికుద్యోగ ప్రయత్నాలు ప్రారంభించాడు. వెంకటశర్మ ఒకరిటయిర్డు టీచర్ కొడుకు టీచర్ ట్రయినింగయ్యాడు. ఇంకా ఉద్యోగం రాలేదు. అన్ని అలవాట్లూ ఉన్నాయి. బూతుకధలు మహరంజుగానూ, జోరుగానూ చెబుతాడని అంతా అతని చుట్టూ చేరతారు. కృష్ణారావు ఒక పోలీసు కొడుకు. సాయి ఒక పోలీసుకు దగ్గిరచుట్టం. నిరుద్యోగి పడమటి జిల్లాల్నించి చుట్టుపుచూపుగా ఇటొచ్చాడు.

డిసెంబర్ 31 రాత్రి, స్నేహితురాలు సుందరవల్లి ఇంట్లో సరదాగా గడిపి న్యూయియర్ ముగ్గులు పెట్టి, టీవీ పాటలు చూసుకుంటూ - ఇంకా ఆలీస్యం చేస్తే తల్లి తిడుతుందని భయంతో పదిన్నరదాటాకా చంద్రిక ఇంటికి వస్తుండగా కరెంటు పోయింది. ఆ సమయంలో చాన్నాళ్లనుంచీ మాటుకాసిన ఈ అయిదుగురూ ఆ అమ్మాయిని ఎత్తుకుపోయారు. పాడుపడిన కొవ్వొత్తుల వెలుతుర్లో చీకటి దోబూచులాటలో మత్తుమందు పెట్టి సాముహిక రాక్షసరతి సలిపారు. ఆ బాధకి తట్టుకోలేక కేకలేసింది. గొంతుబలంగా నొక్కాడు శర్మ. పెనుగులాడి స్పృహతప్పింది. చచ్చిపోయిందన్న భయంతో నూతిలో పారేశారు.

తెల్లవారేసరికి ఈ సంగతి పొక్కింది. కాని చంద్రిక తల్లిదండ్రులకి కళ్ళల్లో చీకటి చక్రాలు కమ్ముకున్నాయి. ఇంత స్పష్టంగా తెలియదు - మనిషొకమాట.

ఆ కోలనీలో పౌరహక్కుల సంఘంలో పనిచేసే వర్మ వున్నాడు. అతను విజయనగరం టౌన్లో ప్లీడరు గుమాస్తా. పొక్కిన వార్తలు చెవినపడగా - కూపీలాగాడు. సేకరించిన సంగతులు పౌరహక్కుల సంఘం ముందుపెట్టాడు. పౌరహక్కుల సంఘం, మహిళాసంఘం రెండూ రంగంలో దిగాయి.

నిజనిర్ధారణ కమిటీ ఏర్పడింది. ఆ కమిటీలో మధురవాడలో చిన్న సొంత యిల్లు కట్టుకుని పౌరహక్కుల సంఘం సానుభూతి పరుడైన మేర్లపాక మురళీమోహన్ అనే సీనియర్ అడ్వకేటు కూడా వున్నాడు. ఆరేళ్ళుగా భర్తతో వేగలేక చట్టపరంగా విడాకులు పుచ్చుకున్న పాతికేళ్లు దాటిన ప్రియంవద

అనే మహిళాసంఘం అమ్మాయి వుంది. ఒక గవర్నమెంటు డిగ్రీకాలేజీ లెక్చరరు వున్నాడు. రైతాంగ పేదల సమితి కార్యకర్త వున్నాడు. వీళ్లందరూ కలిసిన కమిటీ ఒకటికి నాలుగుసార్లు - కలవ వలసిన వాళ్లనందర్నీ కలిసి - చూడవలసిన ప్రదేశాలన్నీ చూసి - క్షుణ్ణంగా సంఘటన పూర్వాపరాలన్నీ పరిశీలించి - కరపత్రాలు వేసి పేపర్ స్టేటుమెంట్లిచ్చింది. ఆ కరపత్రాలు పి.ఆర్.సి పేరుతో (పీపుల్స్ రైట్స్ కమిటీ) విడుదలైనయి.

నేరస్తుల పేర్లు కూడా ప్రకటించేసరికి - ఆ కరపత్రాలు సంచలనం సృష్టించాయి.

ఉన్నతస్థాయి పోలీసు అధికార్లతో ఇబ్బందులవల్ల - పత్రికలన్నీ జిల్లా ఎడిషన్లకు మాత్రమే వార్తల్ని పరిమితం చేశాయి. ఒకనొకనాలుగు పేజీల చిన్నపత్రిక మాత్రం ఎక్కువ వివరాలు వేసింది. ఔరా ఈ పౌరహక్కుల సంఘం వాళ్లకెన్ని గుండెలు - కూపీలులాగి ఇంత ఖచ్చితంగా కరపత్రాలు వేసి పేపరు స్టేటుమెంట్లిచ్చారూ - అని మధ్యతరగతి పాఠకులు ఆశ్చర్యపడ్డారు. టీవీలు చూసి, మందుపార్టీలు చేసుకుని - పెచ్చిరేగిపోతున్న కాలేజీ గుంటల్ని తిట్టిపోశారు.

ప్రధాన నిందితుడు హెడ్‌కానిస్టేబిల్ కొడుకు అంకినీడు, రెండవవాడు వెంకటశర్మ. కరపత్రంలో అయిదు గురిపేర్లువున్నాయి. ఈ సంఘటన వివరాలు తెలిసికూడా 'ఆత్మహత్య' అని అసత్య ప్రచారం చేస్తున్న వాళ్ల గురించి కూడా నిజనిర్ధారణ కమిటీ చెరిగిపోసింది. కేసు హైకోర్టులో వేస్తున్నామన్న తీవ్రహెచ్చరిక కూడా వుంది. ఒక్కగానొక్క కూతుర్ని కోల్పోయిన చంద్రిక తల్లిదండ్రుల పట్ల పూర్తిసానుభూతిని వ్యక్తపరుస్తూ, పురుషస్వామ్య దుర్మార్గంపైనా, పోలీసు వ్యవస్థపైనా చర్చలేవదీసింది.

అంకినీడు తప్ప మిగతా నలుగురూ పరారీ అయ్యారు. ఎట్టకేలకు, చిట్టచివరకు నిక్కినీలిగీ పోలీసులు ఎఫ్.ఐ.ఆర్.కట్టారు. పి.ఆర్. చంద్రిక పేరూ తలిదండ్రుల పేరూ తప్ప మిగతా వివరాల్లేవు. ఏదోక రకంగా కేసుమూసేద్దామని సత్తిరాజును సమాధానపర్చారు. రెండోకొడుక్కి ఉద్యోగం ఇప్పిస్తామన్నారు. పత్రికలవాళ్లకి కూడా "అధికారిక కధనం" అందజేశారు.

అంతా సద్దుమణిగి పోయిందన్న దశలో - సంక్రాంతి తరువాత కరపత్రాల సుడిగాలి లేచింది. పత్రికలవాళ్లక్కూడా మంచి 'మేటర్' దొరికింది. పౌరహక్కుల సంఘం, మహిళాసంఘంతో పాటు మరికొన్ని ప్రజాసంఘాలు గొంతుకలిపాయి. ముఖ్యమంత్రికి గవర్నర్‌కి టెలిగ్రాములు, కలక్టర్‌కి మెమొరాండాల్తో పరిస్థితి బేజారెత్తి పోతున్నది.

★★★

పౌరహక్కుల సంఘం, తన కూతురు హత్యకేసులో ఎందుకు తలదూర్చి గట్టిగా పనిచేస్తున్నదో సత్తిరాజుగ్గాని, అతని కుటుంబానిగ్గాని అంతుపట్టలేదు. మిలట్రీలో పనిచేస్తున్న పెద్ద కొడుకురానే లేదు. భీమవరంలో డిగ్రీ ఫస్టియర్ చదువుకుంటున్న సత్తిరాజు రెండోకొడుకు చంద్రిక తమ్ముడు వచ్చాడు, వెళ్లాడు.

లోగడ రాజమండ్రిలో ఒక కానిస్టేబిల్ ఆత్మహత్య చేసుకున్న కేసులో కూడా పౌరహక్కుల సంఘం కరపత్రాలు వెయ్యడం గుర్తొచ్చింది. నిజనిర్ధారణ కమిటీ ఆత్మహత్య కాదనీ, హత్యనీ స్టేషన్‌లో కొందరు ఉన్నతాధికారుల్తో గొడవ పడ్డం వల్ల, అతను హత్యకు గురయ్యాడనీ, దాన్ని 'ఆత్మహత్యగా' డిపార్టుమెంట్ కథనం అల్లిందనీ కరపత్రాలు వొచ్చాయి. ఆ పోలీసు కుటుంబానికి కేవలం పౌరహక్కుల సంఘం వల్లే న్యాయం జరిగిపోయిందా? - అని కొందరు వేళాకోళం చేసినా - వాళ్ల ప్రమేయం వల్ల కొన్ని నిజాలు బయటికొచ్చి కొందరు బదిలీలు, సెలవుమీద వెళ్లడాలూ జరిగాయని సత్తిరాజు అప్పట్లో విన్నాడు. ఇటువంటి సంఘటనే గుంటూరుజిల్లాలో కూడా జరిగింది. పౌరహక్కుల సంఘం అంటే నక్సలైట్లు సంఘం అని విన్నాడు. ఎన్‌కౌంటర్లూ, లాకప్‌డెత్ కేసులూ, వరకట్న మరణాలూ - ఇలాంటి వాటిల్లో పనిచేస్తుందని విన్నాడు. ఇప్పుడు తన కూతురి హత్య విషయంలో పని చేస్తుంటే ఆశ్చర్యం వేసింది, సత్తిరాజుకు కాస్త సంతోషం కూడ ఎందుకో కలిగింది.

అంకినీడు తండ్రి సీనియర్ హెడ్ కానిస్టేబిల్ అతని గురించి సత్తిరాజు చాలా సంగతులు వినివున్నాడు. ప్రమోషన్ లిస్టులో వున్నాడని కూడా విన్నాడు ఇంతలో అతని కొడుకు మీద ఈ బలమైన కేసొచ్చి పడింది.

చంద్రికకు అందరూ అన్యాయం చేశారు. ఆమె అందమే ఆమెకి అన్యాయం చేసిందా? ఈ సమాజంలో, ఈ పురుషస్వామ్య వ్యవస్థలో అందంగా వయసులో వున్న ఆడపిల్ల జీవితానికి భద్రత లేకపోవడం, అందాన్ని ఇప్పటికీ భోగ్యవస్తువుగా, స్వంతం చేసుకోవాలనే దుర్మార్గ ప్రవృత్తికి మూలంగా విశ్లేషిస్తూ పౌరహక్కుల సంఘంవాళ్లు వేసిన కరపత్రాలు చాలామందిలో ఆలోచనలు చేసాయి.

ఆమెకు జరిగిన అన్యాయం, ఎవరికీ జరగరాదనీ, నేరస్తులకి శిక్షతప్పించుకునే అవకాశం వుండరాదనీ నిజనిర్ధారణ కమిటీ పట్టుదలగా వుంది. (ఉత్తరాంధ్రకు చెందిన ఒక ఇంచార్జీ మంత్రి - నేరస్తులెంత పెద్దవారయినా వదిలి పెట్టేది లేదని పత్రికల కొక స్టేట్‌మెంటిచ్చాడు) రెండుమూడు హక్కుల సంఘాలూ, మహిళాసంఘాలూ, కొన్ని ప్రజాసంఘాలూ కలిసి - ఒక పోరాట కమిటీగా ఏర్పడి పనిచెయ్యనారంభించాయి.

చంద్రికది వివాదాస్పదమరణం అనీ, పూర్తి వివరాలు దర్యాప్తులో తేలవలసివుందనీ, రెండోసారి పోస్టు మార్టం జరిపిన నివేదిక అందవలసివుందనీ పోలీసులకథనం. కాగా - రెండోసారి మరిన్ని వివరాల్తో వెలువడ్డ కరపత్రాలు చంద్రికది హత్యేనని అంటున్నాయి. పీపుల్స్ రైట్స్ కమిటీ - పి.ఆర్..సి. కేసులో గట్టిగా పనిచేస్తున్నది.

కొందరు బదిలీలయ్యారు. ఒక ఆఫీసరు మెడికల్ లీవు(?!) పెట్టాడు.

పోలీసు కూతురు వివాదాస్పద మరణం కోసం హక్కుల సంఘాలగొడవ ఏమిటని - పోలీసు అధికార్లకి చెడ్డ చిరాగ్గానూ, చాలా కోపంగానూ, ఆశ్చర్యంతో కూడిన వ్యతిరేకతగానూ వుంది. బహుకొద్దిమందికి 'అనధికారికంగా' ఆనందంగా వుంది.

చంద్రిక తల్లి చాలా లొంగిపోయింది. ఈ కొద్ది రోజుల్లోనే ఇరవై నాలుగ్గంటలూ పిల్లకళ్లలో ఆడ్డం వల్ల ఆమె మొహంలో నిరంతరం ఆందోళన కనిపిస్తున్నది. పోలీసు అధికారుల మాటలూ, ఇరుగుపొరుగుల మాటలు, హక్కులసంఘాల మహిళాసంఘాల మాటలూ, విలేకర్ల రాకపోకలూ ఆమె మనసును చాలా గందరగోళపర్చాయి.

సత్తిరాజయితే ఆడవాళ్ల కంటే అధ్వాన్నంగా గడియ గడియకూ తలుచుకుని కళ్లనీళ్లు పెట్టుకుంటున్నాడు. తాగుతున్నాడుగాని స్పృహలోనే వుంటున్నాడు. ఎంత తాగినా "కిక్కు" రావడం లేదు. అతనికి మనసూ శరీరమూపచ్చి పుండులా మారినట్టయింది.హక్కుల సంఘాల వాళ్ల మాటలు వింటూ-నేరస్తులకు శిక్ష పడొచ్చునన్న ఆలోచన మిణుకు మిణుకు మన్నాది.

"సిచ్చ పడితే-చిలకలాంటి చంద్రిక తిరిగొస్తాదేటి ?" అన్నాదో పొరుగింటి పేదరాశి పెద్దమ్మ.

కాని పడితే చూడాలని ఆశగా వుంది సత్తిరాజుకు. ఎస్.పి.దొరగారు పిల్చి - నీకేంభయం లేదు. నేరస్తులకి శిక్ష పడుతుందని కాస్త మనసుకుదట పడేమాటలు చెప్పి, ధైర్యం ఇచ్చి డ్యూటీలో జాయినవ్వమన్నారు. స్టేషన్‌లోనే వుండూగాన్లే అన్నారు. కొన్నాళ్ల పాటు నీకు తేలిక పన్లే చెపుతామన్నారు. సరేనని సత్తిరాజు డ్యూటీలో జాయినయ్యాడు.

జాయినయినవారం తిరక్కుండా - హక్కుల సంఘం కార్యకర్తలు మీద కేసులు బనాయించారని తీరని తెలిసింది. ఆధారంలేని అసత్య ప్రచారాలు చేస్తున్నారని - కేసులు పెట్టారట.

ఒకరోజు సాయంత్రం - వర్మ సత్తిరాజుంటికి వచ్చాడు. తమమీద పెట్టిన కేసులు సంగతి చెప్పి - బెయిలు సంపాదించడానికి పడినపాట్లు కూడా చెప్పాడు. నువ్వూ, నీ భార్య మాకు సహకరిస్తే తప్పక - చంద్రిక హంతకులకు శిక్షపడేలా చుస్తామని చెప్పాడు. మహిళా సంఘాలు కేసును అవసరమైతే హైకోర్టుదాకా తీసుకు వెళ్లెందుకు తగిన వివరాలు కూడా తీస్తున్నారు. హక్కుల సంఘాలు కూడా గట్టిగా పనిచేస్తామనీ చెప్పాడు.

తానుగత ముప్పయి మూడు సంవత్సరాలు పనిచేస్తున్న తన డిపార్టుమెంటు సంగతి - పూర్వం ఎప్పటికంటే ఇప్పుడింకా బాగా తెలిసినట్టయింది సత్తిరాజుకి హక్కుల సంఘాల, మహిళా సంఘాల పట్టుదల చుస్తుంటే అతనికి ఆశ్చర్యకరమైన - ఆదోకటి మనసంతా నిండిపోయింది.

తన కుమారికి రెండేళ్ల వయసులో చాలాజబ్బు అని తెలిసింది. ఒకడాక్టరు ఆ జబ్బు - ఎక్కువ డబ్బులు ఖర్చవకుండానే నయం చేశారు. అతను ఎలా చచ్చిపోయాడో ఉన్నట్టుండి గుర్తొచ్చి మనసంతా ఆక్రోశించింది.

*రచనా కాలం : జనవరి చివరి వారం 2001*